క్లుప్తంగా

ఆర్థికసాయం



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న గ్రామస్తులు

కేశంపేట: మండల పరిధిలోని బోధునంపల్లి గ్రామంలో గోరిగె రాములమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. అంత్యక్రియల నిమిత్తం మంగళవారం స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి రూ.5వేలు, పిప్పళ్ల శేఖర్ రూ.3వేలు ఆర్థిక సాయం మృతురాలి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో బాలరాజ్, కోటేశ్వర్, యాదయ్య, కృష్ణయ్య, రాజు, బీరప్ప, సురేశ్ పాల్గొన్నారు.

రాజ్‌కుమార్ నాగవత్‌కు డాక్టరేట్



డాక్టరేట్ ప్రదానం చేస్తున్న వైస్ ఛాన్స్‌లర్ క్రిష్టఫర్ తదితరులు

మొయినాబాద్‌రూరల్: పరిశోధనలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య ఆర్.క్రిష్టఫర్ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామ సమీపంలో గల చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో రాజ్‌కుమార్ నాగవత్‌కు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా చైతన్య యూనివర్సిటీలో రసాయన శాస్త్ర విభాగంలో డిజైన్ అండ్ సింథసిస్ ఆఫ్ సమ్ నావేల్ పోడోపిల్లో ఫ్యాక్సిన్ డేరివేటివ్స్ అండ్ దేర్ అంటికేన్సర్ స్క్రీనింగ్ అనే అంశంపై డాక్టర్ ఎస్.అరుంధతి పర్యవేక్షణలో రాజ్‌కుమార్ నాగవత్ పరిశోధనలు నిర్వహించారు. పరిశోధనలు పరిశీలించిన అనంతరం వారికి డాక్టరేట్ లభించినట్లు తెలిపారు. యూనివర్సిటీలో మంగళవారం రాజ్‌కుమార్ నాగవత్‌ను అభినందిస్తూ క్రిష్టఫర్ డాక్టరేట్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి సాత్వికరెడ్డి, రిజిస్ట్రార్ రవీందర్, జగదీశ్వర్, సుందర్, రాజు, పబ్లిక్ రిలేషన్ అధికారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న దస్తావేజు లేఖరులు

షాద్‌నగర్: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వడ్డెమాన్ లక్ష్మమ్మ(45) అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. జిల్లా దస్తావేజుల సంఘం అధ్యక్షుడు వెంకటయ్య ఆధ్వర్యంలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో లక్ష్మమ్మ చిత్రపటానికి దస్తావేజు లేఖర్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. లక్ష్మమ్మ అంత్యక్రియలు స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా తెల్కపల్లి మండలం నడిగడ్డలో బుధవారం నిర్వహిస్తున్నట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. నివాళులర్పించిన వారిలో దస్తావేజు లేఖరుల సంఘం షాద్‌నగర్ అధ్యక్షుడు ఒగ్గు కిషోర్, ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ రాధిక, అనిల్, శ్రీకాంత్‌రెడ్డి, రాజేశ్, అర్షద్, రవి, చందర్‌రాజు, విజయ్, సురేశ్, రాజు, శివ, ఆదామ్, నరేందర్, వీరేందర్, చిట్టిబాబు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

మాడ్గుల: మండల కేంద్రంలోని నాగిళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2002-03 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన వారంతా ఒక్కచోట చేరి సందడి చేశారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీను, యాదగిరి, జగన్, శ్రీశైలం, అశోక్, తిరుపతి, శారద, పద్మ, గీత, నిర్మల, అవంతి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

లక్షలు వెచ్చించి.. వృథాగా వదిలేసి!

- నిరుపయోగంగా పల్లె దవాఖానా
- ఏడాది క్రితమే భవన నిర్మాణం పూర్తి
- కరెంటు కనెక్షన్ లేదనే సాకుతో ప్రారంభించని వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



నిరుపయోగంగా పల్లె దవాఖానా భవనం

మొయినాబాద్: ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని పల్లె దవాఖానాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం ప్రారంభానికి నోచుకోకపోవడంతో అలంకారప్రాయంగా మారింది. భవన నిర్మాణం పూర్తయి ఏడాది దాటినా కరెంటు కనెక్షన్ ఇవ్వడం లేదనే సాకుతో అధికారులు నిర్లక్ష్యంతో దాటవేస్తూ వస్తున్నారు. దీంతో సంవత్సర కాలంగా ఆ భవనాన్ని నిరుపయోగంగా వదిలేశారు. అధికారులు స్పందించి భవనాన్ని త్వరగా ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

లక్షణంగా వదిలేసి..

మండల పరిధిలోని చిలుకూరులో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం ఉంది. కొన్నేళ్లుగా గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన ఓ చిన్న గదిలో సబ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. అయితే రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం సబ్‌సెంటర్‌కు కొత్త భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. చిలుకూరు బస్టాప్ పక్కనే విశాలమైన ప్రదేశంలో రూ.10లక్షలతో సబ్‌సెంటర్ భవన నిర్మాణాన్ని చేపట్టారు. భవన నిర్మాణం పూర్తయి దాదాపు ఏడాది పూర్తయింది. కానీ ఇప్పటివరకు దానిని ప్రారంభించడం లేదు.

నిర్మాణం పూర్తయినా..

చిలుకూరులో పల్లె దవాఖాన పేరుతో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం భవనానికి కరెంటు కనెక్షన్ ఇవ్వడం లేదని.. అందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. భవన నిర్మాణం పూర్తయినా అందులో కరెంటు ఫిట్టింగ్ జరగలేదు. ఈ కారణంగానే భవనాన్ని ప్రారంభించలేకపోతున్నట్లు పేర్కొంటున్నారు. అయితే ఆరునెలల క్రితం జిల్లా వైద్యాధికారి ఆ భవానాన్ని పరిశీలించారు. మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కానీ ఇంతవరకు దానిని పట్టించుకోలేదు. దీంతో రూ.లక్షలు ఖర్చుపెట్టి నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభానికి నోచుకోకుండా.. ప్రజలకు అందుబాటులోకి రాకుండా ఉంది. ఇప్పుడు రాష్ట్రంలో ఏర్పాటైన కొత్త ప్రభుత్వమైనా దీన్ని పట్టించుకుంటుందా అని స్థానికులు అంటున్నారు. ఈ విషయంపై మండల వైద్యాధికారిణి వాణిని వివరణ కోరగా.. మండల పరిధిలోని చిలుకూరులో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం భవనం దాదాపుగా పూర్తయింది. కానీ కాంట్రాక్టర్ భవనాన్ని మాకు అప్పగించలేదు. కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయంటున్నారు. అవి పూర్తిచేసి మాకు అప్పగిస్తే అందులోనే ఆరోగ్య ఉపకేంద్రాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు



పాలకేంద్రం నుంచి వెలువడుతున్న మురుగునీరు

మురుగు గుంత.. ప్రజల చింత

- పాలకేంద్రం నుంచి వెలువడుతున్న మురుగునీరు
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు



కొందుర్గులో కొనసాగుతున్న పాలకేంద్రం

కొందుర్గు: పాలకేంద్రం నుంచి వెలువడుతున్న మురుగునీరు నిల్వ ఉండడంతో మండల పరిషత్ కార్యాలయ పరిసరాల్లో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. కొందుర్గు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఓ భవనాన్ని పదేళ్ల క్రితం పాలకేంద్రం నిర్వహణకు కేటాయించారు. అయితే పాలకేంద్రంలో నుంచి వృథాగా వదులుతున్న నీటితో పాటు పాలక్యాన్లు శుభ్రం చేసిన నీళ్లన్నీ కలిసి పాలకేంద్రం వెలుపలే నిలుస్తున్నాయి. ఈ నీరు ఒకేచోట చేరి పెద్ద మురుగుగుంతగా మారింది. దీంతో మండల పరిషత్ కార్యాలయం, విద్యా వనరుల కేంద్రం, ఐకేపీ, ఉపాధిహామీ భవనాల్లో పనిచేసే ఉద్యోగులు, వివిధ పనులపై కార్యాలయాలకు వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దుర్వాసన, దోమల బెడదకు తట్టుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు నిల్వకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని లేదా కార్యాలయం ఆవరణలో నుంచి పాలకేంద్రాన్ని మరోచోటుకు తరలించాలని కోరుతున్నారు.

బీఆర్‌ఎస్ కనుమరుగవడం ఖాయం



మాట్లాడుతున్న బాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, తదితరులు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ కనుమరుగవడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఏపీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ లోక్‌సభ ఎన్నికల్లో పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఏకతాటిపైకి వచ్చి బీజేపీకి ఓటు వేశారన్నారు. విద్యార్థులు, యువకులు, రైతులు మహిళలు ఇలా అందరూ ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపరచడం శుభపరిణామన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు బ్యాంకు గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. ఇది పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషితోనే సాధ్యమైందన్నారు. బీజేపీ అభ్యర్థి డీకే అరుణ లక్ష మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణలో అస్థిత్వాన్ని పూర్తిగా కోల్పోయిందన్నారు. దేశం కోసం ధర్మం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి బీజేపీకి అండగా నిలిచారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలు బీజేపీపై ఎన్నో అసత్య ఆరోపణలు చేశారని, వాటిని ప్రజలు నమ్మలేదన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి డీకే అరుణ ఎన్నో పోరాటాలు చేసిందని, పోరాట పటిమ ఉన్న నేత ఎంపీగా ఎన్నిక కావడం ఖాయమన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలాచారి, జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరు వెంకటేశ్‌గుప్తా, చెంది మహేందర్‌రెడ్డి, వంశీ, మనోహర్‌రెడ్డి, భూషణ్, కృష్ణయ్య, చెన్నయ్య, వెంకటేశ్, శ్రీశైలం, కుర్మయ్య, రుషికేశ్, మచ్చ సుధాకర్ రావు, స్వామి, కుర్మయ్య, రఘురాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత

కడ్తాల్: మండల కేంద్రంలోని 4వ వార్డులో మంగళవారం ఉదయం ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి ఆండాలు అనే మహిళ మృతి చెందింది. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన తిరుపతి యాదమ్మ మధ్యాహ్నం మృతి చెందింది. బాధిత కుటుంబాలను రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ పరామర్శించి ఆయా కుటుంబాలకు ట్రస్ట్ తరఫున ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున సాయం అందించారు. అదే విధంగా బాధిత కుటుంబాలకు సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా రూ.10వేలు, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి రూ.5వేలు, కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. పరామర్శించిన వారిలో సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, నాయకులు భాస్కర్ రెడ్డి, రాఘవేందర్, దేవేందర్, రవి ఉన్నారు.

పది ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

షాద్‌నగర్: పదో తరగతి సీబీఎస్‌ఈ ఫలితాల్లో పట్టణంలోని ఠాగూర్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరెస్పాండెంట్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. 13 మంది విద్యార్థులు 90శాతానికిపైగా, 29 మంది విద్యార్థులు 80 నుంచి 90 శాతం మార్కులు సాధించినట్లు తెలిపారు. మనీశ్ 500 మార్కులకు గాను 477 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

వృథా నీటిని స్కూల్‌లోకి రానీయొద్దు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: కమ్మదనం గురుకుల పాఠశాలలోకి మిషన్ భగీరథ వృథా నీటిని రానీయకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులకు సూచించారు. మండల పరిధిలోని కమ్మదనం గ్రామ శివారులో ఉన్న బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత పాఠశాలలోకి వస్తున్న మిషన్ భగీరథ వృథా నీటి విషయంపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గురుకుల పాఠశాల, మిషన్ భగీరథ ప్లాంట్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మిషన్ భగీరథ పథకంలో భాగంగా నీటిని శుద్ధి చేసిన తర్వాత వచ్చే వృథా నీరు గురుకుల పాఠశాలలోకి వెళ్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి పాఠశాలలోని నీరు వెళ్లకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వృథా నీటిని వన్యప్రాణులకు ఉపయోగపడే విధంగా పక్కనే ఉన్న అటవీ ప్రాంతంలోకి వెళ్లేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు వృథా నీటిని దారి మళ్లించేలా వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ నాగేశ్వర్ రావు, డీఈ సందీప్, ఏఈ రూప, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాబర్‌ఖాన్, ఎంపీటీసీ అరుణ, అంజయ్యగౌడ్, దేవగిరి నవీన్, అశోక్, చందు, రాజు, రాఘవేందర్, శ్రీశైలం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు చైతన్యమేదీ?

సమీపిస్తున్న ఖరీఫ్ సాగు

- అందని సూచనలు, సలహాలు
- పట్టించుకోని వ్యవసాయ అధికారులు



తాళ్లపల్లిలో పొలం దున్నుతున్న రైతు

షాబాద్: రాష్ట్రంలో రైతులకు, వ్యవసాయాధికారులకు మధ్య దూరం పెరుగుతోంది. సీజన్‌కు ముందు రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వడంలో అధికారుల వైఫల్యం కనిపిస్తోంది. ఖరీఫ్ సీజన్ సమీపిస్తోంది. ప్రతీ సంవత్సరం నిర్వహించే మన తెలంగాణ-మన వ్యవసాయం నిర్వహణపై అధికారులు ఊసే ఎత్తడం లేదు. సాగులో అవలంబిస్తున్న మెలకువలు, పంటల బీమా, యంత్రాల రాయితీలపై అవగాహన సదస్సుల నిర్వహణ అటకెక్కింది. ప్రతీ ఏడాది ఏప్రిల్, మే మాసాల్లో నిర్వహించే రైతు చైతన్య యాత్రలు ఈ ఏడాది లేనట్టేనని అధికారుల ద్వారా తెలుస్తోంది. ఖరీఫ్ సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించడం, పంట మార్పిడి, అధిక మోతాదు ఎరువుల వినియోగం తదితర అంశాల్లో రైతులకు అవగాహన కరువవుతోంది.

కార్యక్రమ లక్ష్యాలు..

రైతులకు అండగా నిలిచే ఉద్దేశంతో అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టేవారు. పంటల మార్పిడి, పంటలకు మద్దతు ధర రాకపోతే గోదాంలలో నిల్వ చేసుకొని రుణం పొందడం, పంట రుణాలు, పంటల బీమా, వర్షాభావ పరిస్థితుల్లో సాగు చేయాల్సిన పంటల రకాలు, ఎరువుల వాడకం, పెట్టుబడి తగ్గించుకోవడం, ఆశించిన దిగుబడి పొందడం, రైతుకు అందించే ప్రోత్సాహం తదితర అంశాలపై రైతులకు వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు అవగాహన కల్పించేవారు. కానీ ఇప్పుడు అవగాహన కార్యక్రమాలు నిలిచిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.



షాబాద్‌లో రైతు చైతన్య యాత్రలో మాట్లాడుతున్న అధికారులు (ఫైల్)

రైతులకు నష్టం

గతేడాది జూన్ మొదటి, రెండో వారాల్లో ఆశించిన వర్షాపాతం నమోదు కాలేదు. అప్పటికే వేల మంది రైతులు పత్తి విత్తనాలు వేసి నష్టపోయారు. అలాంటి సందర్భాల్లో రైతులు అవలంబించాల్సిన విధానాలు, సాగు పద్ధతులు, అతివృష్టి, అనావృష్టి తదితర సందర్భాల్లో ఎలాంటి చర్యలు చేపట్టాలో అనే అంశాలపై సలహాలు అందడం లేదని పలువురు అభిప్రాయపడ్డారు. ఇకనైనా వ్యవసాయాధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వివిధ పంటలపై సూచనలు, సలహాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

ఎంతో ప్రయోజనం..



రైతు చైతన్య యాత్రల ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. అవగాహన లోపంతో మోతాదుకు మించి ఎరువులు వినియోగించి సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ఆశించిన దిగుబడి రాక రైతులు ఏటా నష్టపోతున్నారు. ఆయా సమస్యలను అధిగమించిన ఆర్థిక నష్టాల నుంచి రైతులను గట్టెక్కించడానికి అవగాహన కార్యక్రమాలు దోహదపడతాయి. వ్యవసాయ సూచనలు అందుతున్నా ఆయా అనుబంధ శాఖల అధికారుల ద్వారా ఒక్క సూచన అందుతున్న దాఖలాలు లేవు.

– గంగిడి భూపాల్‌రెడ్డి, రైతు హైతాబాద్

ఆదేశాలు అందలేదు..



రైతు చైతన్య యాత్రలపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు జారీ కాలేదు. వ్యవసాయ శాఖకు చెందిన అధికారులు సమగ్ర రైతు సమాచార సేకరణ, ఆన్‌లైన్ నమోదు, రైతుబంధు, కిసాన్ సమ్మాన్ నిధి తదితర పథకాలను రైతులకు చేర్చడంలో ఉన్నారు. సాధ్యమైన మేర ఏఈఓల ద్వారా రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నాం. చైతన్య యాత్రల నిర్వహణపై ఆదేశాలు అందిస్తే నిర్వహిస్తాం.

– వెంకటేశం, ఏఓ, షాబాద్

చేవెళ్ల అసెంబ్లీ పరిధిలో 71.83% పోలింగ్



చేవెళ్ల అసెంబ్లీ పరిధిలోని పోలింగ్ సామగ్రిని రిసివింగ్ కేంద్రం వద్ద అప్పగిస్తున్న సిబ్బంది

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల అసెంబ్లీ పరిధిలో సోమవారం జరిగిన పోలింగ్‌లో 71.83శాతం నమోదైనట్లు చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల అసెంబ్లీ పరిధిలో జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు. ఈ ఎన్నికలను ప్రశాంతంగా శాంతియుతంగా నిర్వహించేందుకు సహకరించిన పోలింగ్ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు, పోలీస్ సిబ్బందికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చేవెళ్ల అసెంబ్లీ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, నవాబుపేట, మొయినాబాద్ మండలాల పరిధిలో మొత్తం 298 పోలింగ్ బూత్‌ల్లో మొత్తం 2,69,960 మంది ఓటర్లు ఉండగా 1,93,911 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో చేవెళ్ల అసెంబ్లీ పరిధిలో 71.83 శాతంగా నమోదైంది. చేవెళ్లలో అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ఓటుహక్కును వినియోగించుకున్నారు. సోమవారం పోలింగ్ ముగిసిన పోలింగ్ శాతాలు ప్రకటించేందుకు అర్ధరాత్రి దాటింది. అర్ధరాత్రివరకు రిసీవింగ్ కేంద్రాల వద్దకు వచ్చిన పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామగ్రిని అప్పగించారు.

చేవెళ్ల అసెంబ్లీ పరిధిలోని మండలాల వారీగా పోలింగ్ శాతం వివరాలు ఇలా ఉన్నాయి..

మండలం పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
నవాబుపేట	36,942	26,422	71.52
శంకర్‌పల్లి	66,172	47,708	72.10
మొయినాబాద్	61,048	44,003	72.08
షాబాద్	47,204	33,290	70.52
చేవెళ్ల	58,594	42,488	72.51
మొత్తం	2,69,960	1,93,911	71.83

చేవెళ్ల ప్రజల మద్దతు కాంగ్రెస్‌కే

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి

కందుకూరు: కులాల కుంపట్లతో బీఆర్‌ఎస్, మత విద్వేషాలతో బీజేపీ లబ్ధి పొందాలని చూసినా లౌక్యంతో చేవెళ్ల ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికే మద్దతుగా నిలిచారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పది సంవత్సరాలు అధికారంలో ఉండి రాష్ట్రానికి ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. తెలంగాణ ప్రజల ఆగ్రహాన్ని గ్రహించి కులాల పేరుతో రాజకీయ మనుగడ కోసం ప్రజల మధ్య చిచ్చు పెట్టి ప్రయోజనం పొందాలని చూశారన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీలు కుమ్మక్కైనా కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయమని దీమా వ్యక్తం చేశారు.